క్లుప్తంగా

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



తిరుమలగిరి మోడల్ స్కూల్‌లో సభ్యత్వం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తిరుమలగిరి : సీపీఎస్ విధానం రద్దు చేసి ప్రమోషన్లతో కూడిన బదిలీలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు క్రాంతికుమార్ కోరారు. శుక్రవారం అనంతారం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. శనివారం జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.సోమయ్య, హీరూనాయక్, దానయ్య, సోమసుందర్, వీఎల్ఎస్.చారి, మధు, లింగయ్య, రజని, కవిత, హేమలత పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత



పాఠశాలకు చేరిన క్రీడాసామగ్రి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం రూ.60వేల విలువ చేసే క్రీడాసామగ్రిని బహూకరించారు. సూర్యాపేటలోని రత్నసూర్య చారిటబుల్‌ట్రస్ట్ వారు యానాల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలకు విద్యార్థుల కోసం క్రీడాసామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మారెడ్డి, హెచ్ఎం రాచకొండ ప్రభాకర్, ఉపాధ్యాయులు సాయిలు, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులను అందిస్తున్న దాతలు

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని కోటపహాడ్ ప్రాథమిక పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎడ్ల ప్రవీణ్ సుమారు 60 మంది విద్యార్థులకు రూ.18 వేల విలువచేసే స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బుర్రె మధు రూ.8 వేల విలువ చేసే బీరువాను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కే.వెంకటేశ్వర్లు, ఏబీఎన్ సదానందం, కోతి మల్లయ్య, పలవరపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిలక రమేష్, రాణి, గిలకత్తుల సైదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి స్కూటర్ బహూకరణ



స్కూటర్‌ను బహూకరిస్తున్న దాతలు

భానుపురి : వాసవి ఎన్నారై క్లబ్ ఆధ్వర్యంలో పలువురు దాతలు శుక్రవారం దివ్యాంగుడైన వల్లభోజు వెంకటేశ్వర్లుకు జిల్లా కేంద్రంలో రూ.1,20,000 విలువ చేసే స్కూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో దాతలు స్వామి కమలాకర్ గంగాభవాని, వాసవి ఎన్నారై క్లబ్ అధ్యక్షుడు పసుపర్తి కృష్ణమూర్తి, గుండా ఉపేందర్, వీర్లపాటి రమేష్, మిర్యాల వెంకటేశ్వర్లు, బోలగాని భిక్షపతి, అంజలి స్కూల్ పూర్వ విద్యార్థులు వెంకటేష్, నారాయణ విశాల్, తల్లాడ శ్రీనివాస్, పసుపర్తి జ్యోతి, అనంతుల రవి, ఎస్వీఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన వంగూరి కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పేరాల పూలమ్మ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నెబోయిన రాముయాదవ్‌లు శుక్రవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొత్తోజు ఎల్లాచారి, కన్నెబోయిన రాములు, బొట్టు సురేష్, కన్నెబోయిన సాయిలు, పేరాల బాషా, కర్నాటి అంజయ్య, బొల్లెద్దు సురేష్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేమి.. ఆన్‌లైన్‌కు దూరం!

- గ్రామాల్లో పన్నుల చెల్లింపునకు రెండేళ్ల కిందటే ఈ–పోర్టల్ తెచ్చిన ప్రభుత్వం
- అవగాహన లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలను పొందలేకపోతున్న గ్రామీణులు



అర్వపల్లిలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

అర్వపల్లి : పంచాయతీ ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించినప్పటికీ దీనిపై ప్రజలకు సరైన అవగాహన లేక ఎవరూ చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజల ఇబ్బందులు తీర్చడానికై మున్సిపాలిటీలలో మాదిరిగానే గ్రామ పంచాయతీలలో కూడా ఆన్‌లైన్‌లో చెల్లించే విధానం కల్పించారు. ఇందుకోసం పంచాయతీ ఈ–పోర్టల్‌లో ఇంటి పన్నులు చెల్లించే సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. కానీ మండల వ్యాప్తంగా ఎక్కడా ఈవిధానంపై సరైన అవగాహన లేక సాధారణ పద్ధతిలోనే వసూలు కొనసాగుతుంది. పంచాయతీ ఈ–పోర్టల్‌లో సిటిజన్ సర్వీస్‌లోకి వెళ్లి ప్రజలు నేరుగా వారి బకాయిలు చెల్లించవచ్చు. ఇంటి యజమానులు పన్నులను డబ్బు రూపంలో చెల్లించినా పంచాయతీ అధికారులు వాటిని మళ్లీ ఆన్‌లైన్‌చేయాల్సిందే. దీంతో చెల్లింపుల నందు పూర్తి పారదర్శకత ఉంటుంది. కొందరు సిబ్బంది ఇంటి పన్నుల డబ్బులు తీసుకొని రశీదులు ఇవ్వకపోవడం, యజమానులు అధికారులు ఇచ్చిన రశీదులు పోగొట్టుకోవడం లాంటివి జరుగుతుంటాయి. కానీ ఆన్‌లైన్‌తో ఏ ఇబ్బందులు ఉండవు. ఆన్‌లైన్‌లో కట్టిన బిల్లులను ఎప్పుడైనా చూసుకోవచ్చు.

మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలలో సుమారు 8,615 గృహాలు ఉన్నాయి. ఈ గృహాలకు సంబంధించి 2022–23 సంవత్సరానికి పన్నులు చెల్లించిన ప్రతి ఒక్కరూ నేరుగానే పంచాయతీ సిబ్బందికి చెల్లించారు. ఆన్‌లైన్ విధానాన్ని ఏ ఒక్కరు కూడా వినియోగించుకోలేదు. అందరికీ స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తున్న ఈ రోజుల్లో పంచాయతీ పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లించాలి



అర్వపల్లి పట్టణ వాసులు కూడా ఇంకా నేరుగానే ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. స్థానికంగా ఇంటింటికీ పంచాయతీ ఈ–పోర్టల్‌పై అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇప్పటినుంచైనా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

– మాగి నాగయ్య, పంచాయతీ కార్యదర్శి, అర్వపల్లి

ప్రజలకు వివరిస్తున్నాం



పంచాయతీ ఈ–పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులపై ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూనే ఉన్నాం. అయినా ఎక్కువ మంది పాత పద్ధతినే నమ్ముతున్నారు. రశీదుపై పంచాయతీ ముద్ర ఉండాలంటూ పంచాయతీ కార్యాలయానికి వస్తున్నారు. సిబ్బందికే ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించడం ఎంతో ఉపయోగకరం.

– సందీప్‌కుమార్, ఎంపీఓ, జాజిరెడ్డిగూడెం

సమీకృత మార్కెట్ పరిశీలన



సూర్యాపేటలోని సమీకృత మార్కెట్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి



సూర్యాపేట : మంత్రిని కలిసిన కార్యవర్గ సభ్యులు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. రూ.30 కోట్ల నిధులతో ఈ సమీకృత మార్కెట్ భవనం పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉండడంతో మార్కెట్‌ను మంత్రి జగదీష్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్ మొత్తం సమీకృత భవనం లోపలే ఉండడంతో సరుకుల కొనుగోలుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం భవనం నలువైపులా సెంట్రల్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్లో ఏర్పాటు చేసే టేబుల్స్ నాణ్యతను పరిశీలించారు. మార్కెట్ ప్రారంభోత్సవం నాటికి సెంట్రల్ కూలింగ్ సిస్టం పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట కలెక్టర్ వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ రామానుజల రెడ్డి, అధికారులు, తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన సూర్యాపేట జిల్లా లారీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతుల కృపాకర్, ట్రెజరర్ అనంతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎల్గూరి రాంబాబు గౌడ్, ఉపాధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి గుండు సురేష్ గౌడ్, సహాయ కార్యదర్శి రాచకొండ రాములు, సహాయ కార్యదర్శి అవిలే మల్లేష్, సంయుక్త కార్యదర్శి పిన్ని శ్రీనివాస్, ఝల్లూరి రామ్మూర్తి గౌడ్, లారీ ఓనర్స్ సభ్యులు పాల్గొన్నారు.



మద్దిరాల : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మృతురాలుకు మంత్రి, ఎమ్మెల్యే నివాళి

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నల్లాని శ్రీనివాస్‌రావు మాతృమూర్తి నల్లాని చెల్లమ్మ(సరస్వతి) ఇటీవల మృతి చెందారు. దీంతో విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, గ్రంథాలయ కమిటీ జిల్లా డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, గుడ్ల వెంకన్న, కోడి శ్రీనివాస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



అర్వపల్లిలో రాస్తారోకో చేస్తున్న నియోజకవర్గంలోని రెండో ఏఎన్ఎంలు



సూర్యాపేట : పోలీస్ స్టేషన్ ఎదుట..



చివ్వెంలలో అరెస్టయిన రెండో ఏఎన్ఎంలు

అర్వపల్లి : రెండో ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాజారాం, రెండో ఏఎన్ఎంల జిల్లా నాయకురాలు మేడి లక్ష్మీబాయి అన్నారు. రెండో ఏఎన్ఎంల నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అర్వపల్లిలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఎన్ఎంలు స్థానిక వై జంక్షన్‌లో మానవహారం నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారం రోజుల నుంచి ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కోట రామస్వామి, ఏఎన్ఎంల నాయకురాళ్లు స్వప్న, రమాదేవి, విజయశాంతి, జయమ్మ, రజిత, యశోద, రూప, స్వాతి, మాధవి, వాణి, శకుంతల, నాగరాణి, పార్వతి, నాగమ్మ, భారతి, కమల, రమ, బేబి, రజిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల అక్రమ అరెస్టు తగదు

సూర్యాపేట : ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఏఐటీయూసీ ఖండిస్తుందని ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఆయన మాట్లాడారు. 23 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారని వారిని వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు వి.శిరోమణి, జి.భవాని, పి.రేణుక, ఎస్.సంధ్య, సువర్ణ, జయసుధ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : సెకండ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంత్రి జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడి నేపథ్యంలో శుక్రవారం ఏఎన్ఎంలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో గోగుల మమత, మండవ ఉషారాణి, పి.వెంకటరమణ ఉన్నారు.

దరఖాస్తులకు విధి విధానాలతో ప్రజల అవస్థలు

తిరుమలగిరి : గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు ప్రభుత్వం రూపొందించిన విధి, విధానాలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని బీసీ యువజన సంక్షేమ సంఘం తిరుమలగిరి మండల శాఖ అధ్యక్షుడు అంబటి మహేష్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతులేని పత్రాలతో సామాన్య ప్రజలు మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దరఖాస్తుదారులను గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఆయన వెంట అంబటి మహేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పొడిగించాలని, అర్హులందరికీ షరతులు లేకుండా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. దరఖాస్తుల గడువు కేవలం మూడు రోజులు మాత్రమే ఇచ్చి మరోసారి ప్రభుత్వం నిరుపేదలను మోసం చేస్తోందన్నారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శేఖర్, బొంకూరి అజయ్, లింగరాజు, వెంకన్న, స్వామి, నాయకులు, తదితరులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న సలిగంటి వీరేంద్ర

దురాజ్‌పల్లి : రోడ్లు గుంతలమయంగా ఉన్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు తీరా దాతల సహకారంతో రోడ్లకు మరమ్మతులు చేయిస్తుంటే పోలీసుల సహాయంతో అడ్డుకోవడం తగదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 16వ వార్డులో శ్రీ బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ తల్లి దేవస్థానం రోడ్డు గుంతలమయంగా మారిందని అన్నారు. ఈ సమస్యను స్థానిక కౌన్సిలర్ సలిగంటి సరిత పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని తెలిపారు. ఆదివారం బోనాల పండుగ ఉండడంతో ఖమ్మం రోడ్డు పెట్రోల్ బంక్ నుంచి ముత్యాలమ్మ గుడి వరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు సహకారంతో 30 టిప్పర్లతో మట్టిని పోయించి గుంతలను పూడుస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్ గౌడ్, జిల్లా నాయకులు పాలగాని ధనుంజయ్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకారపు పరిపూర్ణ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

అర్వపల్లి : ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండలంలోని కొత్తగూడెంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాక సుధాకర్, అటెండర్ యాదగిరి, యాకస్వామి, రైతులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయొద్దు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం చేయొద్దని అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పుష్పకు వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నందున విద్యార్థులకు అవసరమయ్యే కుల, ఆదాయ పత్రాల జారీని నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. అలసత్వం చేస్తే విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సౌకర్యాలు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొనపర్తి యశ్వంత్, బానోతు యాకన్న, మున్న పాల్గొన్నారు.

మేరీ మాటి – మేరా దేశ్ వారోత్సవాలు

పెన్‌పహాడ్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో మేరీ మాటి – మేరా దేశ్ (నా మట్టి – నా దేశం) వారోత్సవాలు నిర్వహించినట్లు కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, డి.ఆదర్శ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7500 కలశాల్లో (కుండల్లో) పవిత్ర మట్టిని, దాంతో పాటు మొక్కలను సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. పవిత్రమైన మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత్ వాటికను నిర్మిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్సీ సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు దివ్య, శివాని, దీపిక, వైష్ణవి, శార్వాణి, భాగ్య శ్రీ, పుష్ప, రైతులు సూర్యనారాయణ, శ్రీనివాస్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిల్పకుంట్లలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సలిగంటి నరేష్ మాట్లాడారు. ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ నాగభూషణం పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేని 39బైక్‌లు, 4 ఆటోలను సీజ్ చేసినట్లు తెలియజేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సీఐ బ్రహ్మమురారి, మద్దిరాల ఎస్ఐ రవీందర్ నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు



సూర్యాపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు శుక్రవారం పట్టణంలోని రైతుబజారులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తళమళ్ల హస్సేన్ మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధనలో దళితులందరూ ఐక్యమవుతూ తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ బోయిల అఖిల్, రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, న్యాయవాదుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఏడిండ్ల అశోక్, న్యాయవాది బొల్లెద్దు వెంకటరత్నం, నామా వేణు, గాజుల నరసయ్య, కాసిమల్ల వెంకట నరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



మట్లాడుతున్న గుండా రమేష్

సూర్యాపేటటౌన్ : ఆంగ్ల భాషపై పట్టు సాధిచాలని ఆంగ్ల ఉపన్యాసకుడు గుండా రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆనంద విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆంగ్ల భాష పట్ల నైపుణ్యం సాధించడానికి చెన్నైకి చెందిన నైస్ ఎడ్యుకేషన్ విద్యా మేనేజర్ జస్టిన్ ఆధ్వర్యంలో శుక్రవారం నైస్ ఇంగ్లిష్ భాష క్లబ్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంగ్ల భాషకు ప్రపంచ స్థాయిలో అత్యధిక ప్రాధాన్యం ఉందని అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఆంగ్ల భాషను మాట్లాడడం అభ్యసించాలని సూచించారు. ఆంగ్ల భాషలో నైపుణ్యం సంపాదిస్తే భవిష్యత్తులో అద్భుత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమా, నితీష్ కుమార్, సిస్టర్ థెరిసా, ఆంగ్ల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



విద్యార్థులకు గ్లాసులు అందజేస్తున్న హెచ్ఎం గవాస్కర్, దాత బాషింగ్

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు గవాస్కర్ అన్నారు. మండల పరిధిలోని లాల్‌సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ తాగేందుకు దాత అంగోతు బాషింగ్ శుక్రవారం గ్లాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాణోతు రామకృష్ణ, ఉపాధ్యాయురాలు యర్రంశెట్టి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఆత్మకూరు పీహెచ్‌సీలో సర్వే చేస్తున్న నాయకులు

ఆత్మకూరు (ఎస్) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్, నర్సు పోస్టులను భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతిశీల యువజన సంఘం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే కాలం కాబట్టి పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే డీఎంహెచ్ఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, కోశాధికారి బండి రవి, దడిగెల లింగయ్య, కొమ్ము దేవలింగం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



తుంగతుర్తిలో మాట్లాడుతున్న కరణ్

తుంగతుర్తి : మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని కాసా స్వచ్ఛంద సంస్థ ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్ కరణ్ అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, చట్టాలపై శుక్రవారం మండల కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించి మాట్లాడారు. చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, భ్రూణహత్యల నిర్మూలనకు మహిళా సంఘాలు, యువజనులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసా స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్, కాసా సభ్యులు అన్నెపర్తి నర్సన్న, మధుసూదన్, రమేష్, రాజు, గంగా, శ్రీనివాస్, భాగ్యమ్మ, శాంతమ్మ, తేజశ్రీ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఈసీ మాత్రల పంపిణీ

మునగాల : మండలంలో శుక్రవారం బోదకాలు వ్యాధి నివారణ (డీఈసీ) మాత్రలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆశావర్కర్లు అనిత, వాణి, వనజ, లక్ష్మిలు విద్యార్థినులకు మాత్రలు వేశారు. రేపాల, మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 రోజుల పాటు డీఈసీ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయా కేంద్రాల వైద్యాధికారులు వినయ్‌కుమార్, పి.రవీందర్ తెలిపారు.



డీఈసీ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎస్సీ వర్గీకరణ సాధనకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏపూరి రాజు మాదిగ

చిలుకూరు : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధనకు సిద్ధం కావాలని ఎంఎస్‌పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి సదస్సుకు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల ఇన్‌చార్జ్ మల్లెపంగు సూరి, నాయకులు సిద్దెల శ్రీను, కందుకూరి ఎల్లయ్య, గుండెపంగు సాయికుమార్, ముదిగొండ వీరస్వామి, సుధాకర్, రామారావు, చిరంజీవి, శంకరయ్య పాల్గొన్నారు.

డీటీఎఫ్ రజతోత్సవం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

చివ్వెంల : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్‌లో నిర్వహించే డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సీహెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్బతి వెంకటేశ్వర్లు, గోగితాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నామా వీరయ్య, కొత్తపల్లి వెంకట్ రెడ్డి, చెరుకు సింహాద్రి, జానిరెడ్డి, కవిత, తమీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మునగాల : మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో శనివారం మండల కేంద్రానికి చెందిన పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు జె.సామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.